# రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

- సీఎం కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన మన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

మహేశ్వరం, నవంబర్ 9 :రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే మహేశ్వరం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నుంచి 80 మంది నాయకులు గ్రామ సర్పంచ్ కంది అరుణ రమేశ్, ఉప సర్పంచ్ బురమోని నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికి మంత్రి గులాబీ కండువాలను కప్పి సానుకూలంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహేశ్వరం నియోజక వర్గంలో జరుగుతున్న పనులను చూసి ఇతర పార్టీల నుంచి రోజురోజుకు బీఆర్ఎస్ పార్టీలోకి జోరుగా వలసలు కొనసాగుతున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజలు సంక్షేమ రాజ్యాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని అన్నారు. తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అని ప్రజలు మరోసారి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని ఆమె అన్నారు. ప్రతి పక్ష పార్టీలకు అభ్యర్థులు దొరుకక నేటికి అయోమయంలో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణకు ఏం చేశారని ఆమె నిలదీశారు. కరోన లాంటి కష్టకాలంలో కానరాని నాయకులు నేడు ఎన్నికలు రాగానే గ్రామాలల్లో వాలిపోతున్నారని ఆమె ఎద్దేవా చేశారు. ప్రజలు ప్రతి పక్ష పార్టీల మాటలను విని మోసపోవద్దని ఆమె సూచించారు. మహేశ్వరంలో ఎమ్మెల్యేగా మరోసారి అవకాశం కలిపిస్తే నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు సముచిత స్థానం కల్పిస్తుందని ఆమె పేర్కొన్నారు.

## హోం మంత్రి సమక్షంలో టీజేఎస్ కార్యకర్తల చేరిక



తెలంగాణ జన సమితి (టీజేఎస్) హైదరాబాద్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జహీరుద్దీన్ రాజీనామా చేసి హోం మంత్రి మహమూద్ ఆలీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ హైదరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి పుస్తె శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురువారం మినిస్టర్ నివాసంలో టీజేఎస్‌కు చెందిన 100 మంది మైనార్టీ కార్యకర్తలకు మహమూద్ ఆలీ బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

*– సిటీబ్యూరో, నవంబరు 9(నమస్తే తెలంగాణ)*

## కాలం చెల్లిన కాంగ్రెస్ పార్టీ గల్లంతే..

### మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి




మహిళలకు అభివాదం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 9: కాలం చెల్లిన కాంగ్రెస్ పార్టీ గల్లంతు కాక తప్పదని మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి తెలిపారు. మండల పరిధి చౌదరిగూడ, కొర్రెముల, కాచవాని సింగారం గ్రామాలలోని పలు కాలనీలలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి మల్లారెడ్డి గురువారం సాయంత్రం పాల్గొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలలో ఆదరణ కరువైందని, టికెట్ల అమ్మకానికే ఆ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి చేపట్టిన బీఆర్ఎస్‌కే ప్రజలు పట్టం కట్టి కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేయనున్నారని చెప్పారు. ఊహకందని పథకాలను తీసుకువచ్చి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించిన కేసీఆర్‌ను ప్రజలు దేవుడిలా కొలుస్తున్నారని, మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మల్లారెడ్డి హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి, మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి కొండల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ బైరు రమాదేవి మాజీ సర్పంచ్ రాములు గౌడ్, కొర్రెముల సర్పంచ్ వెంకటేశ్ గౌడ్, కాచవాని సింగారం సర్పంచ్ వెంకట్ రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ కృషి

### మౌలాలిలో ఆత్మీయ సమ్మేళనంలో అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 9: మైనార్టీల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తుందని మల్కాజిగిరి అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మౌలాలిలోని క్లాసిక్ కన్వెన్షన్ హాల్‌లో మైనార్టీల ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. మౌలాలి, మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లలో అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ఇంటింటికి ప్రచారం నిర్వహించి సమావేశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని మైనార్టీలకు పూర్తి రక్షణ ఉంటుందన్నారు. విద్యార్థుల చదువులకు రెసిడెన్సియల్ స్కూల్స్ ఏర్పాటు చేశామని, విదేశాలలో చదువు కోవడానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం చేస్తున్నామని పేర్కొన్నారు. మౌలాలిలో ఇంటింటి ప్రచారంలో ఇక్కడి సమస్యలను తెలుసుకున్నానని ఆయన తెలిపారు. మైనార్టీ ఆడబిడ్డల పెండ్లికి షాదీ ముబారక్ పథకంలో రూ.1,00,116 ఆర్థిక సహాయం చేస్తున్నామని, ఎన్నికల తర్వాత రూ.2,00,116 ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. ఇక్కడ షాదీఖాన (ఫంక్షన్ హాల్) లేక పోవడంతో పెండ్లి కోసం ఫంక్షన్ హాళ్లకు పేదలు అప్పులు చేసి వివాహాలు చేస్తున్నట్లు గుర్తించానన్నారు. మౌలాలిలో షాదీఖాన కట్టించి మీకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటామన్నారు. ఇవే కాక పలు సమస్యలను గుర్తించినట్టు పేర్కొని, వారి సాధనకు కృషి చేస్తానని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ గెలుపు కోసం కారు గుర్తుకు ఓటు వేయాలన్నారు. ప్రజల కష్టాలను పట్టించుకోని పార్టీలను ఎన్నికల్లో ఓడించాలన్నారు. కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్, జేపీసీ వెంకన్న, కాజ రైసుద్దిన్, అమీనుద్దిన్, బషీర్ బాయ్, గౌస్ బాయ్, భాగ్యనందరావు, వంశీ, జుయబ్, సలీమ్, సమీర్, జబ్బర్ పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారంలో గాంధీకి అపూర్వ స్వాగతం

### కొండాపూర్ డివిజన్‌లో కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి ప్రచారం



ఇంటింటి ప్రచారానికి వచ్చిన అరెకపూడి గాంధీకి హారతిస్తున్న మహిళలు, చిత్రంలో కార్పొరేటర్ హమీద్ పటేల్

కొండాపూర్, నవంబర్ 9: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాలను మెచ్చి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలపడం అభినందనీయమని శేరి లింగంపల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కొండాపూర్ డివిజన్ పరిధిలో కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి ఆయన ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ మాట్లాడుతూ, గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నదని, దేశంలోనే తెలంగాణను మొదటి స్థానంలో నిలిబెట్టిందన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని మెచ్చి ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌కు మద్దతునిస్తున్నారన్నారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించేందుకు మేము సైతం అంటున్నారన్నారు. ప్రచారంలో ఆడపడుచులు మంగళహారతులు ఇచ్చి స్వాగతం పలకడం సంతోషంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని బీఆర్ఎస్ పార్టీ కోరుతుందన్నారు. అందరినీ అన్ని విధాలుగా అభివృద్ధి మార్గంలోకి తీసుకువచ్చేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విజన్‌లో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం



నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్ ఉషారాణికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

- రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టి.ప్రకాశ్ గౌడ్

మణికొండ, నవంబర్ 9: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ కృషి చేస్తున్నదని, అందుకే బీఆర్ఎస్ పార్టీకి ప్రజల నుంచి పెద్ద ఎత్తున మద్దతు వస్తున్నదని, ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ 17వ వార్డు కౌన్సిలర్ కె.ఉషారాణి నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్, మాజీ ఎంపీపీ మల్లేష్, పార్టీ అధ్యక్షుడు రామేశ్వర నర్సింహ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమక్షంలో గురువారం చేరారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి పనులకు ఆకర్షితులై, కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఏండ్ల నుంచి కష్టపడి ఎన్నో సేవలు అందించినా పార్టీలో కష్టపడే వారికి ఎలాంటి గౌరవం ఇవ్వకపోవడం వల్లనే కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకువచ్చి బీఆర్ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా ప్రకాష్‌గౌడ్ గెలిపించుకొని పార్టీ అభ్యున్నతికి పాటుపడతానని కౌన్సిలర్ ఉషారాణి ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీ పార్టీలలో ప్రజల సంక్షేమం కోసం పాటుపడే నాయకులకు సుముచిత స్థానం లేదని, అందుకే ప్రజల కోసం పని చేసే ప్రతి నాయకుడు బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. వీరితో పాటు నార్సింగి మున్సిపాలిటీ మైనార్టీ మహిళా ప్రెసిడెంట్ హీనాకీరం, మహిళలు, యువకులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ రేఖ యాదగరి, గండిపేట మండల పార్టీ అధ్యక్షులు నర్సింహ, నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్లు జి.అరుణ జ్యోతి, పత్తి ప్రవీణ్, సునీత గోపాల్, కోఆప్షన్ సభ్యులు, నార్సింగి మార్కెట్ కమిటి వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్ యాదవ్, మల్లేష్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారు

### అంబర్‌పేట ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్

కాచిగూడ, నవంబర్ 9: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావడంతో ప్రజలు రాజకీయాలకు అతీతంగా బీఆర్ఎస్ పార్టీని విశ్వసిస్తున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీజేపీ అంబర్‌పేట బీసీ సెల్ సీనియర్ నాయకుడు తులి మామిడి శ్రీహరి చారి, తన అనుచర వర్గం 270 మంది నాయకులు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సమక్షంలో గురువారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధిని చూసి ప్రజలంతా బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నారని, పేదల సంక్షేమ విషయంలో సీఎం కేసీఆర్ రాజీపడే ప్రసక్తే లేదని, పార్టీ కోసం నిజాయితీగా కష్టపడే వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పడకంటి అంజయ్యచారి, గొట్టల వినోద్‌చారి, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ నాయకులను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, తదితరులు